క్లుప్తంగా

ప్రతిష్ఠ మహోత్సవాలకు పూర్ణాహుతి



ఆలయంలో హోమం చేస్తున్న దృశ్యం

మిడుతూరు : స్థానిక శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి ధ్వజ స్తంభ, శిఖర ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా (41రోజుల పండుగ) మంగళవారం ఆలయ ప్రాంగణంలో వేద పండితులు సుబ్రహ్మణ్యంశర్మ, ఆలయ అర్చకులు వెంకట్రామయ్య ఆధ్వర్యంలో నవగ్రహ హోమం పూజ, ధ్వజ కలశ శిఖర హోమం, పూర్ణాహుతి తదితర విశేష పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు తువ్వా శివరామకృష్ణారెడ్డి, కాతా హరిసర్వోత్తమ రెడ్డి, బన్నూరు సర్వోత్తమ రెడ్డి, నారాయణ, దేవన్న తదితరులు పాల్గొన్నారు.

ఓంకార సిద్ధేశ్వరస్వామికి రుద్రాభిషేకం

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన ఓంకారంలో కొలువైన శ్రీ గంగ, ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వరస్వామికి ఉగాది పర్వదినం సందర్భంగా మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఈఓ ఏ.నాగప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఉదయాన్నే స్వామి, అమ్మవార్లను పుష్పాలతో అలంకరించి గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన పూజలు వైభవంగా చేపట్టారు.

తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న ఎస్ఐ, విశ్వహిందూ పరిషత్ సభ్యులు

ఆత్మకూరు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం వీహెచ్‌పీ వారి తెలుగు నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆత్మకూరు ఎస్ఐ నారాయణరెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్ర ప్రజలు ఈ సంవత్సరం సుఖశాంతులతో ఆనందోత్సవాల మధ్య జీవించాలని ఆకాంక్షించారు. విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు సుదర్శనశర్మ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ఉగాది రోజే నూతన సంవత్సరం ప్రారంభమవుతుందని, ఈ పండగను ఆనందంగా జరుపుకోవడంతో పాటు హిందూ సంప్రదాయాలను సంస్కృతిని కాపాడేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు భానుమూర్తి, శ్రీధర్, శ్రీధర్‌గుప్తా, శివరామ్, ఆవులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సేవలో శ్రీశైల జగద్గురు పీఠాధిపతి



పీఠాధిపతికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న ప్రధానార్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను శ్రీశైల జగద్గురు పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ డాక్టర్ చెన్నసిద్ధరామ శివాచార్య మహాస్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. మంగళవారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన పీఠాధిపతికి ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు, అర్చకస్వాములు, ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు పీఠాధిపతికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పీఠాధిపతి మల్లికార్జున స్వామివారిని, భ్రమరాంబాదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్దగల ఆశీర్వచన మండపంలో పీఠాధిపతి గౌరవార్థం వస్త్ర సమర్పణ చేశారు. పీఠాధిపతి అనుగ్రహ బాషణ చేశారు.

శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం



నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సంజీవనగర్, బైటిపేట కోదండరామాలయం, ఎస్బీఐ కాలనీ రామాలయం నూనెపల్లెలోని సీతారామాంజనేయ దేవాలయం, మూలసాగరంలోని కోదండ రామాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. రామాయణ పఠనం చేశారు. స్వామివార్లకు ఉదయాన్నే పంచామృతాభిషేకాలు, పూలంగి సేవ, అర్చనలు, సింధూర అర్చనలు నిర్వహించి మహామంగళ హారతులు సమర్పించారు. సాయంత్రం సంజీవనగర్ రామాలయంలో స్వామి అమ్మవార్లకు వేదపండితులు పవన్ శర్మ, కార్తికేయ శర్మల ఆధ్వర్యంలో ఊంజల్ సేవ నిర్వహించారు.

ఆనందోత్సాహాలతో తెలుగు సంవత్సరాది

- భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు
- గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు
- ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు
- ఈ ఏడాది పాడిపంటలకు అనుకూలమంటున్న పురోహితులు
- ఎద్దులను అలంకరించి కాడి కట్టిన రైతన్నలు



సుంకులమ్మ ఆలయంలో క్యూలో భక్తులు



సుంకులమ్మకు పూజలు చేస్తున్న భక్తులు



కొత్తపల్లిలో పంచాంగం వినిపిస్తున్న ఆలయ పురోహితులు



పాములపాడులో నాభిశిల వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న ప్రజలు

నందికొట్కూరు: తెలుగు వారి తొలి పండుగైన ఉగాదిని పురస్కరించుకొని మంగళవారం భక్తులు పట్టణంలోని సుంకులమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం భక్తులతో కిటకిట లాడింది. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. పట్టణంలోని ఆంజనేయ దేవాలయంలో పురోహితులు రంగయ్యస్వామి, రామాలయంలో పురోహితులు చంద్రయ్యస్వామి పంచాంగ పఠనం చేశారు. ప్రజలు శ్రద్ధగా విని, వారి పేరుపై ఈ ఏడాది బలం(ఆర్థిక స్థితి) ఆదాయం, వ్యయం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు.

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం ఉగాది పర్వదినాన్ని ప్రజలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని బొల్లవరం, కొణిదేల తదితర గ్రామాలలోని దేవాలయాల్లో సుంకులా పరమేశ్వరి అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. కొణిదేల గ్రామంలోని మల్లికార్జున స్వామి దేవాలయంలో పురోహితుడు భాస్కరయ్య పంచాంగాన్ని భక్తులకు చదివి వినిపించారు.

ఊరూరా వేడుకలు..

పాములపాడు:ఉగాది పండుగను పురస్కరించుకొని మంగళవారం ఊరూరా ఉగాది సంబరాలను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. పండుగ సందర్భంగా ఉదయమే తలంటు స్నానాలాచరించి, ఉగాది పచ్చడి చేసి, పిండి వంటలతో నైవేద్యాలు గ్రామ దేవతలకు, కాయ కర్పూరాలతో సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. భారీ వృక్షాలకు ఊయలలు కట్టి యువతీ, యువకులు సంతోషాలతో ఊగారు. ఉగాది రోజు ఉట్టి పట్టుకొని ఐనా ఊగాలన్నది పెద్దలు చెప్పే సామేత. పురోహితులు పంచాంగ పఠనం చేశారు. ప్రజలు ఈ సంవత్సరం తన పేరు బలం ఎలా ఉందని చెప్పించుకొని, కుటుంబంలో ఎక్కువ ఆదాయంగా ఉన్న వారు ఎద్దులను అందంగా అలంకరించి కాడి కట్టి పొలాలకు వెళ్లి సేద్యం ప్రారంభించారు.

పగిద్యాల: మండలంలోని తూర్పు,పడమర ప్రాతకోట, ఎం.ఎస్. ఘణపురం, రైతుపల్లె, లక్ష్మాపురం, కొత్త పాలమర్రి, పగిద్యాల, బీరవోలు, సంకిరేణిపల్లె, ఆంజనేయనగర్, వనములపాడు, పాత, కొత్త ముచ్చుమర్రి, నెహ్రూనగర్, పీకే ప్రాగటూరు, అర్లపాడు తదితర గ్రామాల్లోని ప్రజలు మంగళవారం క్రోధినామ సంవత్సర ఉగాది వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. గ్రామ దేవతలైన సుంకులా పరమేశ్వరి, జంబులమ్మ విగ్రహమూర్తులను భక్తిశ్రద్ధలతో పూజించారు. పురోహితుల చేత పంచాంగం చెప్పించుకుని ఈ ఏడాది ఏఏ పంటలకు అనుకూలమో తెలుసుకుని సంప్రదాయాన్ని కొనసాగించారు.

కొత్తపల్లి: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రజలు మండల కేంద్రంలోని శ్రీ పార్వతీ సమేత తాండవ మల్లేశ్వరస్వామిలోని ఆలయంలోని స్వామివార్లకు కుంకుమార్చన, పుష్పార్చన, అభిషేక పూజలు, మంగళహారతి వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాధాకృష్ణ ఆలయంలో శ్రీపార్వతీ సమేత తాండవ మల్లేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాల నడుమ స్వస్తిశ్రీ క్రోధి నామ సంవత్సర మంగళవారం రోజున చైత్ర మాసం శుక్ల పక్షము పాఢ్యమి సందర్భంగా గ్రామ పెద్దల సమక్షంలో పురోహితులు పంచాంగ శ్రవణం, రాజాది నవనాయక శుభ ఫలితములు చెప్పడం జరిగింది.

మహానంది: ఉగాది పర్వదినం సందర్భంగా మహానంది, బండిఆత్మకూరు మండలాల్లో మంగళవారం వేడుకలు వైభవంగా జరిగాయి. అన్ని గ్రామ పంచాయతీల్లో పెద్దా, చిన్నా తేడా లేకుండా ఉదయం నుంచే రంగులు చల్లుకుంటూ వేడుకలు జరుపుకున్నారు. గ్రామాల్లోని పొలిమేర దేవతలు, సుంకులమ్మ, పోలేరమ్మ తదితర ఆలయాల వద్ద భక్తులసందడి కనిపించింది. వేకువజాము నుంచే ఆలయాలకు చేరుకుని అమ్మవార్లకు బోనాలు, నైవేద్యం సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

జూపాడుబంగ్లా : క్రోధినామ తెలుగు సంవత్సర ప్రారంభాన్ని పురస్కరించుకొని మంగళవారం మండలంలోని తాటిపాడు, జూపాడుబంగ్లా, తంగడంచ, తర్తూరు, పారుమంచాల, తర్తూరు, తూడిచెర్ల, తరిగోపుల, 80బన్నూరు, మండ్లెం తదితర గ్రామాల్లో ఉగాది పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తాటిపాడు గ్రామంలో శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కూర్చోబెట్టి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు కొబ్బరికాయ, ఊదిబత్తీలు సమర్పించి మొక్కులు తీసుకున్నారు. సాయంత్రం ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో పురోహితులు పంచాంగ పఠన కార్యక్రమాన్ని నిర్వహించారు. క్రోధినామ తెలుగు సంవత్సరంలో అంతా శుభం జరుగుతుందని పాడి పంటలకు అనుకూలంగా ఉంటుందని పురోహితుడు సత్యనారాయణశర్మ తెలిపారు. అలాగే వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలసాగుకు అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు.



తాటిపాడు గ్రామంలో దేదీప్యమానంగా భక్తులకు దర్శనమిస్తున్న లక్ష్మీచెన్నకేశవస్వామి



తాటిపాడు శివాలయంలో పంచాగపఠనం చేస్తున్న పురోహితుడు సత్యనారాయణశర్మ

సంప్రదాయబద్ధంగా..



పాములపాడులో కాడెద్దులతో వ్యవసాయ పనులు ప్రారంభిస్తున్న రైతన్న

మిడుతూరు : మండల కేంద్రమైన మిడుతూరుతో పాటు అన్ని గ్రామాల్లో మంగళవారం ఉగాది పర్వదిన వేడుకలను ప్రజలు సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. స్థానికంగా వెలసిన గ్రామ దేవతలు శ్రీ సుంకులాపరమేశ్వరి ఆలయం, వన దేవతలైన వసుదేవమ్మ, పాపమ్మ, రామలక్ష్మణులకు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో పంచాంగ శ్రావణం చదివి వినిపించారు. రైతులు తమ ఎద్దులను అలంకరించుకుని తమ పొలాల్లో వ్యవసాయ పనులు మొదలు పెట్టారు.



పడమర ప్రాతకోటలో బోనాలతో సుంకులమ్మ దేవాలయానికి చేరుకున్న భక్తులు



తిమ్మాపురంలో సుంకులమ్మకు పూజలు



బండిఆత్మకూరులో రంగుల బండితో వేడుకలు

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

జూపాడుబంగ్లా: వేసవి ఎండలతీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు ఎండలకు తిరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పారుమంచాల ప్రాథమిక వైద్యాధికారిణి డాక్టర్ యశశ్విని సూచించారు. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో పాటు వడగాలులు వీస్తున్నందున ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.



పారుమంచాల ప్రాథమిక వైద్యాధికారిణి డాక్టర్.యశశ్విని

వడదెబ్బకు గురికాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు..

- అధిక ఉష్ణోగ్రతలున్నందున నెత్తిన టోపీ, టవాలు, గొడుగు లేకుండా ఎండలో తిరగరాదు.
- మందపాటి దుస్తులు, నల్లని దుస్తులు ధరించి ఎండలో తిరగడం వల్ల త్వరగా వడదెబ్బకులోనయ్యే ప్రమాదం ఉంది.
- ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అధికశ్రమతో కూడిన పనులు చేయరాదు.
- ఎండలో తిరిగి ఇంటికి వచ్చిన వెంటనే తీపిప దార్థాలు, తేనె వంటివి తినరాదు.
- శీతలపానీయాలు, అధిక కూల్‌తో ఉన్న మంచి నీటిని తాగడం వల్ల గొంతు సంబంధిత వ్యాధులు వస్తాయి.
- వేసవి ఎండల తీవ్రత నేపథ్యంలో డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్, ఓరల్ రీహైడ్రేషన్ సాల్ట్ కలిపిన నీటిని, కుండలోని నీటిని తరుచుగా తాగుతూ ఉండాలి.
- కొబ్బరినీళ్లు, నిమ్మరసం, వంటివాటిని తాగటం వల్ల శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉంటుంది.
- వడదెబ్బకు గురైన వారి శరీరాన్ని వెంటనే చల్లని నీటితో తడిపిన బట్టతో తడుపుతూ ఉండాలి.
- శరీర ఉష్ణోగ్రత అధికంగా ఉంటే వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్సలు చేయించాలి.
- అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ వడదెబ్బకు గురికాకుండా ఉండాలని సూచించారు.

వైభవంగా కంబగిరిస్వామి ఉత్సవాలు

ఉయ్యాలవాడ: మండలంలోని సుద్దమల్ల గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహ కంబగిరి స్వామి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఉగాది సందర్భంగా ఏటా ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామివారి కల్యాణాన్ని కనుల పండువగా జరిపించారు. సాయంత్రం అల్లూరు, సుద్దమల్ల, ఉయ్యాలవాడ గ్రామస్తులు తేరుబండ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. స్థానికులతో పాటు జమ్మలమడుగు, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఉగాది పండుగను పురస్కరించుకుని ఆయా గ్రామాల్లో వేద పండితులు పంచాంగ శ్రవణం చేశారు. రైతులు పండితులు సూచించిన దిశకు వెళ్లి పొలాల్లో సేద్యపు పనులను ప్రారంభించారు. ఆలయ చైర్మన్ కంపరాజు శ్రీనివాసులుగౌడ్, కార్యనిర్వహణాధికారి చంద్రుడు, కమలేష్‌శర్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చంద్రా రాజేశ్వరరావుకు నివాళి

నంద్యాల (న్యూటౌన్): స్వాతంత్ర్య సమరయోధుడు, సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వరరావు వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ నేతలు బాబాఫక్రుద్దీన్, ప్రసాద్ మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో కమ్యూనిస్ట్ పార్టీ నిర్మాణానికి, పేదల సాగు భూములు, ఇండ్ల స్థలాల కోసం ఆయన ఎన్నో పోటాలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, సోమన్న, ఖలీల్, మాబాష, ఉశేన్, రాంబాబు, మహేంద్ర పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న జేసీ రాహుల్‌రెడ్డి



ఆలయ రాజగోపురం వద్ద జాయింట్ కలెక్టర్ దంపతులకు స్వాగతం పలుకుతున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. మంగళవారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన జాయింట్ కలెక్టర్ దంపతులకు ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మల్లికార్జున స్వామివారిని, భ్రమరాంబాదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆశీర్వచన మండపం వద్ద జాయింట్ కలెక్టర్ దంపతులకు వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. దేవస్థాన ఈఓ స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

వర్షాలు పుష్కలంగా కురుస్తాయి

ఆత్మకూరు: ఈ ఏడాది వర్షాలు పుష్కలంగా కురుస్తాయని, పాడి పంటలు ఆశాజనకంగా ఉండే అవకాశం ఉందని పురోహితులు శరత్‌చంద్ర శర్మ తెలిపారు. పట్టణంలోని శివాలయంలో మంగళవారం పంచాంగ వినిపించారు. ఈ ఏడాది క్రోధి నామ సంవత్సరం సందర్భంగా నవగ్రహ రాశులను బట్టి కొంతమేర వర్షాలకు అవకాశం ఉందని చెప్పారు. కొన్ని చోట్ల వర్షాలు తగ్గినప్పటికీ పంటలకు నష్టం లేకుండా కురిసే అవకాశం ఉందని, ప్రధానంగా అరణ్య సమీప ప్రాంతమైన ఆత్మకూరులో ఈ వానలు పడేందుకు ఆస్కారం ఉందన్నారు. అనంతరం పేర్లు, నక్షత్రాలు తదితర వాటిపై ప్రజలకు ఆదాయ, వ్యయాలను తెలిపారు. ఆలయ నిర్వాహకులు సుబ్బారెడ్డి, శేషఫణి తదితరుల ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు.

సంప్రదాయరీతిలో ఉగాది పర్వదినం

పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం తెలుగు సంవత్సరాది వేడుకలను ప్రజలు ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. క్రోధి నామ సంవత్సరం తాము సుఖసంతోషాలతో వెలగాలని కోరుకుంటూ గ్రామ, పట్టణ దేవాలయాల్లో ప్రజలు విశేష పూజలు నిర్వహించారు. ప్రధానంగా గ్రామదేవతలైన దమ్ములమ్మ, సుంకులమ్మ, సవారమ్మ, యల్లమ్మల దేవాలయాల్లో భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. ప్రజలు నూతన వస్త్రాలు ధరించి దేవాలయాల వద్ద పంచాంగ శ్రవణంలో పాల్గొన్నారు.



శివాలయంలో పంచాంగం వినిపిస్తున్న పురోహితులు శరత్‌చంద్ర

పల్లె చెంతకే పాలన

- సచివాలయాల రాకతో ప్రజా సమస్యలు సత్వర పరిష్కారం
- సొంత ఊరిలోనే అన్నిరకాల ప్రభుత్వ సేవలు
- అర్హత ఉంటే చాలు పథకాలు వెంటనే మంజూరు



నల్లకాల్వ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం

ఆత్మకూరు: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాల ద్వారా పల్లెల చెంతకే పాలన తీసుకొచ్చారు. ప్రజల కోసం గ్రామాల్లోనే గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, పాల సేకరణ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మంజూరు చేశారు. వాటికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసి నూతన కార్యాలయ భవనాలు నిర్మించారు.

పల్లెలకు కొత్త శోభ....

ప్రభుత్వ భవనాల నిర్మాణం కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలను మంజూరు చేసింది. సచివాలయానికి రూ.40 లక్షలు చొప్పున, సబ్ సెంటర్‌లకు రూ.17.5 లక్షలు, ఐతు భరోసా కేంద్రాలకు రూ. రూ.23 లక్షలు, పాలకేంద్రాలకు రూ.14 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేసి నిర్మాణాలకు చేపట్టింది. ఆత్మకూరు మండలంలో 16 సచివాలయాలు, వెలుగోడులో 10, మహానందిలో 13, బండిఆత్మకూరులో 20, శ్రీశైలంలో 3 సచివాలయ భవనాలను నిర్మించారు. ప్రస్తుతం గ్రామాల్లో నూతన కార్యాలయాలతో కొత్త శోభను సంతరించుకోవడమే కాకుండా గ్రామ సర్పంచ్ మొదలు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, రెవెన్యూ, మండల ప్రజా పరిషత్ ఉద్యోగులు, వైద్యసిబ్బంది, వ్యవసాయశాఖ ఇలా పలు కార్యాలయాల ఉద్యోగులు గ్రామాల్లో వెలిసిన నూతన కార్యాలయాల్లో ప్రజలకు సేవలు అందజేస్తూ ప్రశంసలు అందుకున్నారు.

సమస్యల సత్వర పరిష్కారం

గ్రామీణ ప్రాంతాల్లో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేయడం వల్ల ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తోంది. ఇంటి స్థలాలు, రైతు భరోసా, పక్కా గృహాలు, వైఎస్సార్ చేయూత, ఆసరా లాంటి ఎన్నో పథకాలకు అర్హత ఉంటే చాలు మండల కేంద్రాలకు, పట్టణాలకు వెళ్లకుండా సొంత ఊరిలోనే సచివాలయం ద్వారా ఠక్కున మంజూరవుతున్నాయి. టీడీపీ పాలనలో ఓ పథకం మంజూరు కావాలంటే ఆ మండల కార్యాలయానికి వెళ్లి అధికారులను, టీడీపీ నాయకుల చుట్టూ ప్రదక్షిణ చేస్తే కానీ పథకాలు వచ్చేవి కావు. కానీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పాలన అందిస్తున్నారు.

సచివాలయాల్లోనే సమస్యలు పరిష్కరించుకుంటున్నాం



ప్రభుత్వ పథకాలకు సంబంధించి సమస్యలు ఉంటే నేరుగా సచివాలయాల వద్దకు వెళ్లి సమస్యలను చెప్పుకుంటున్నాం. వారు ఆ సమస్యకు సంబంధించి ఫలానా అధికారికి దరఖాస్తులు ఇలా చేయాలని చెబుతూ అర్జీ పెట్టిస్తున్నారు. సచివాలయ వ్యవస్థ అందిస్తున్న సేవలు అభినందనీయం.

– మల్లికార్జున, ఆత్మకూరు

పథకాలు వెంటనే మంజూరవుతున్నాయి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయం ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పాలన అందిస్తున్న గొప్ప నాయకుడు. గ్రామంలోనే సచివాలయం ఉండటంతో అక్కడికి వెళ్లి మాకు కావాల్సిన సమాచారం తెలుసుకోవడంతో పాటు అవసరమైన పథకాలకు దరఖాస్తు చేసుకుంటున్నాం. విచారణ చేసి వెంటనే మంజూరు చేస్తున్నారు. – అబ్దుల్‌కలాం, ఆత్మకూరు

మహానంది ఆలయం మరింత అభివృద్ధి

- పంచాంగ శ్రవణంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని
- ఈ ఏడాది ఎరుపు పంటలకు అనుకూలం



ఉత్సవమూర్తులకు తిరుమంజనం పూజలు చేస్తున్న ఈఓ, పండితులు



మహానందిలో పంచాంగ శ్రవణం పూజలు చేస్తున్న పండితులు, ఈఓ దంపతులు

మహానంది: క్రోధినామ సంవత్సరంలో మహానంది ఆలయం మరింత అభివృద్ధి చెందుతుందని మహానంది దేవస్థానం వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని తెలిపారు. ఉగాది పర్వదినం సందర్భంగా మహానందిలో మంగళవారం రాత్రి పంచాంగ శ్రవణం కార్యక్రమం చేపట్టారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, పండితులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు రవిశంకర అవధాని మాట్లాడుతూ.. మహానంది ఆలయం దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. ఈ ఏడాది ఎరుపు రంగు పంటలకు అనుకూలంగా ఉంటుందన్నారు. రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. మిశ్రమ ఫలితాలు ఉన్న రాశుల వారు ఎలాంటి ఆందోళన చెందకుండా నిత్యం దైవనామస్మరణ చేయడం ద్వారా కష్టాలు తొలగిపోతాయన్నారు.

మహానందీశ్వర దంపతులకు తిరుమంజనం

ఉగాది పర్వదినం పురస్కరించుకుని మహానందీశ్వరుడి దంపతులకు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, ఆలయ శుద్ధి చేసి శ్రీ కామేశ్వరీదేవికి ఖడ్గమాలార్చన, మహానందీశ్వరుడికి రుద్రాభిషేకం, ఉత్సవమూర్తులకు తిరుమంజనం, నింబ కుసుమ భక్షణ నివేదించారు. కార్యక్రమాల్లో ఏఈఓలు యరమల మధు, ఓంకారం వేంకటేశ్వరుడు, పండితులు, అర్చకులు పాల్గొన్నారు.

మహానందికి ఉగాది ఉత్సవ శోభ

ఉగాది ఉత్సవాల సందర్భంగా మహానంది ఆలయ గోపురాలు విద్యుత్ దీప కాంతులలో వెలిగిపోతు న్నాయి. ఆలయ గోపురాలు, రాజగోపురం ముందు భాగంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపకాంతులతో ఆలయానికి ఉగాది ఉత్సవశోభ సంతరించుకుంది.

కన్నడ భక్తులతో కిటకిటలాడిన మహానంది

ఉగాది సందర్భంగా మహానంది ఆలయం కన్నడ భక్తులతో కిటకిటలాడింది. మంగళవారం తెల్లవారుజామున ప్రారంభమైన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్ల దర్శనం బుధవారం తెల్లవారుజాము వరకు నిర్విరామంగా కొనసాగింది. శ్రీశైలంలో రథోత్సవం అనంతరం సాయంత్రం నుంచి రాత్రి వరకు వేలాది సంఖ్యలో కన్నడిగులు మహానంది ఆలయానికి తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. తమ ఆడపడుచులు, అల్లుళ్ల కోసం చాటలు, పట్టుడు కర్రలు, బొమ్మలు కొనుగోలు చేసుకుని వెళ్లారు.

పోలీసు బందోబస్తు

నంద్యాల డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి, సీఐ శివకుమార్‌రెడ్డి, మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు చేపట్టారు. పోలీసు కానిస్టేబుళ్లతో పాటు కేంద్ర బలగాలు బందోబస్తు విధుల్లో పాల్గొన్నారు.



కర్రలు కొనుగోలు చేస్తున్న కన్నడ భక్తులు



విద్యుత్ కాంతులతో వెలిగిపోతున్న ఆలయం